క్లుప్తంగా

విద్యార్థులకు అల్పాహారం



అల్పాహారం అందజేస్తున్న హెచ్ఎం

ఏర్పేడు: మండలంలోని పల్లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు అల్పాహారం అందజేశారు. రేణిగుంట మండలం కరకంబాడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఈటీగా విధులు నిర్వహిస్తున్న సుధారాణి పాఠశాలలోని 520 మంది విద్యార్థులు, 30 మంది ఉపాధ్యాయులకు ఇడ్లీ, వడ, పొంగలితో అల్పాహార విందు ఏర్పాటు చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆనంద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నూతన ఎంపీడీఓకు సన్మానం



ఎంపీడీఓను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

నాగలాపురం: మండల పరిషత్ కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీఓ పీకేఎం బాబును పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు శుక్రవారం సన్మానించారు. వీరిలో ఎంపీపీ సింధూశ్యామ్, సర్పంచ్ సుధాచిన్నదొరై, వైస్ ఎంపీపీ కుమారి ఉదయ్ కుమార్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అపరంజి రాజు, మాజీ సర్పంచ్ మురళి, వార్డు సభ్యులు ముత్తు, గిరి ఉన్నారు.

విద్యార్థులకు ఐడీ కార్డుల పంపిణీ



విద్యార్థులకు ఐడీ కార్డులను అందిస్తున్న ఎంఈఓ, దాతలు

రేణిగుంట: మండలంలోని గాజులమండ్యం ఉన్నత పాఠశాలలో చదువుతున్న 130 మంది విద్యార్థులకు శుక్రవారం దాతలు ఐడీ కార్డులను తయారు చేయించి ఎంఈఓ ఇందిరాదేవి చేతుల మీదుగా పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన ఎంపీటీసీ సభ్యుడు జువ్వల ధనంజయరెడ్డి, జగదీష్‌రెడ్డి కలిసి హైస్కూల్ హెచ్ఎం వేణుగోపాల్‌రెడ్డి అభ్యర్థన మేరకు విద్యార్థులందరికి ఫొటో ఐడీ కార్డులను తయారు చేయించి అందజేశారు. అలాగే ఈ ఏడాది 10వ తరగతి ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు పురస్కారం అందించనున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 కె.రంగనాథయ్య పాల్గొన్నారు.

వినాయక వ్రత కల్ప పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణ చేస్తున్న చెంగల్రాజు

ఏర్పేడు: మండలంలోని మడిబాక సచివాలయంలో సర్పంచ్ చెంగల్రాజు ఆధ్వర్యంలో శుక్రవారం వినాయక వ్రత కల్ప పుస్తకావిష్కరణ జరిగింది. గ్రామానికి చెందిన గుండ్రాజు సుకుమార్ ఏడేళ్లుగా ఈ పుస్తకాలను పలు పాఠశాలల్లోని విద్యార్థులు, గ్రామస్తులకు అందజేస్తున్నారు. వినాయక చవితి వ్రత నియమాలు, పూజా కార్యక్రమానికి పుస్తకం ఎంతో అనువుగా ఉంటుంది. కార్యక్రమంలో గుండ్రాజు పరమానందరాజు, సుబ్రమణ్యం రాజు, దశరథరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు వినాయక విగ్రహాల పంపిణీ

శ్రీకాళహస్తి: పట్టణంలోని రోటరీ క్లబ్‌లో వినాయక చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు సురేంద్ర కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం వినాయక విగ్రహాలను పంపిణీ చేయనున్నారు. పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్

శ్రీకాళహస్తి: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేవతి అన్నారు. మండలంలోని అమ్మపాలెం సచివాలయంలో శుక్రవారం పౌష్టికాహార మహోత్సవాలు నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాలు చిన్న పిల్లల సంరక్షణ కేంద్రాలని తెలిపారు. పిల్లలు, గర్భిణులు, బాలింతలకు కావాల్సిన పోషకాహారాన్ని అందిస్తున్నాయని చెప్పారు. కూరగాయలు, పండ్లు, తృణధాన్యాలు తీసుకోవాలని సూచించారు. రక్తహీనతను అధిగమించేందుకు పౌష్టికాహారం తప్పనిసరి అన్నారు. 104 డాక్టర్ రంజిత మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో చౌకగా దొరికే ఆకుకూరలు, మొలకెత్తిన గింజలు, మునగాకు, వేరుశనగ గింజలు మొదలైన ఆహార పదార్థాలు తీసుకోవాలన్నారు. అనంతర గర్భిణులకు పౌష్టికాహారం అందజేశారు. అంగన్‌వాడీ టీచర్లు భాగ్యవతి, శారద, శంకరమ్మ పాల్గొన్నారు.

నవరత్నాలతో నవవసంతం

- అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు
- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి



రేణిగుంట: సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి



వడ్డిమిట్టలో సంక్షేమ బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే

రేణిగుంట: ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాల పథకాలతో పేద జీవితాల్లో వెలుగులు నిండాయని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. అర్హత ఉన్న ప్రతి నిరుపేదకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సాయంత్రం రేణిగుంట వడ్డిమిట్ట, శివకుమార్‌నగర్, పాంచాలినగర్‌లో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. పేదల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న నవరత్న పథకాలు అందుతున్నాయా..? అని అడిగి తెలుసుకున్నారు. నవరత్న పథకాల లబ్ధిని ప్రజలకు వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలను అందజేస్తామన్నారు. ఎవరైనా అర్హులై ఉండి సాంకేతిక కారణాల చేత పథకాల లబ్ధి అందకుంటే వారి ఫిర్యాదులను స్వీకరించి సమస్య పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే గ్రామంలో మౌలిక వసతుల మెరుగునకు నిధులు మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

2024లో ఆ రెండు పార్టీలు భూస్థాపితం

ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో పనిచేసే కార్యకర్తలు తలెత్తుకుని తిరుగుతున్నారని, పవన్‌కల్యాణ్‌ను నమ్ముకున్న ఆ పార్టీ నాయకులు పక్క పార్టీల జెండాలు మోయాల్సిన దుస్థితి తలెత్తిందన్నారు. పవన్ కల్యాణ్ పార్టీ పెట్టి 16 ఏళ్ల గడుస్తున్నా, ఆయనకు సొంత అజెండా లేదని, చంద్రబాబును సీఎం సీట్లో కూర్చోబెట్టేందుకు ఆరాటపడుతున్నారన్నారు. జైలులో ములాఖత్ అయి టీడీపీతో కలిసి పోటీ చేస్తామని చెప్పి ముసుగు తొలగించి లోకేష్‌తో కాపురం పెట్టారన్నారు. దేశ చరిత్రలోనే ఏ రాష్ట్రంలో లేని విధంగా జగనన్న ప్రభుత్వంలో విద్య, వైద్యం, పేదలకు ఇంటిస్థలాల పంపిణీ కార్యక్రమాలకు పెద్దపీట వేసి విప్లవాత్మకమైన మార్పులను తీసుకొచ్చారన్నారు. రాష్ట్రంలో 17 నూతన వైద్య కళాశాలలను తీసుకొచ్చి ఐదు మెడికల్ కళాశాలలను ప్రారంభించారన్నారు. జగనన్న పేదలకు చేసిన మేలు వల్ల గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇంటింటా తమను సాదరంగా స్వాగతిస్తూ జగనన్నకు అండగా నిలుస్తామని ప్రజలు చెబుతుంటడం సంతోషకరమన్నారు. ఎంత మంది ఒక్కటైనా 2024లో జగనన్న ముఖ్యమంత్రి కావడం తథ్యమన్నారు. కార్యక్రమంలో రేణిగుంట ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు సంధ్యారాణి, వైస్ ఎంపీపీ సుజాత, సింగిల్‌విండో అధ్యక్షుడు గణేష్‌రెడ్డి, సర్పంచ్ నగేషం, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, ఉప సర్పంచ్ ఇర్ఫాన్, మాజీ ఎంపీటీసీ నాగరాజు, కోఆప్షన్ సభ్యుడు సుభాన్‌రాజ, ఖదీర్, మాజీ మండల కోఆప్షన్ సభ్యుడు ఆర్ఎం రఫీవుల్లా, సుందరమూర్తి, వార్డు సభ్యులు చైతన్య, కృష్ణమూర్తి, ఈశ్వరి, మల్లిరెడ్డి, కుట్టి, శ్రీకాంత్, రమణ, నరసింహులు, రసూల్, జగదీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఊంజల్ సేవ



ఊంజల్ సేవలో పద్మావతి అమ్మవారు

నారాయణవనం: పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ఊంజల్ సేవ కనుల పండువగా జరిగింది. వేకువజామున సుప్రభాత సేవలో మేల్కొలిపి నిత్య కైంకర్యాలను నిర్వహించారు. స్వామిఅమ్మవార్లకు అభిషేకాలు చేశారు. సాయంత్రం తిరుచ్చి వాహనంపై పద్మావతి అమ్మవారిని అధిష్టింపజేశారు. ఆలయ ప్రాకారంలో ఊరేగించారు. అనంతరం ఊంజల్ సేవ చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ఉపాధిహామీ పనుల పరిశీలన

రేణిగుంట: మండలంలోని అత్తూరులో జరుగుతున్న ఉపాధిహామీ పనులను శుక్రవారం జిల్లా డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ పరిశీలించారు. కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి జాబ్ కార్డుదారుడు విధిగా 100 రోజులు పని చేయాలని సూచించారు. మండలంలో జరుగుతున్న ఉపాధి పనుల్లో కూలీల సంఖ్యను మరింత పెంచాలని ఏపీఓ జ్యోతిశ్రీకి సూచించారు.

అటవీ భూ సమస్యపై మంత్రికి వినతి



మంత్రి పెద్దిరెడ్డికి సమస్యను వివరిస్తున్న డేవిడ్

కేవీబీపురం: మండలంలోని కళత్తూరు, పాతపాళెం గ్రామాల్లోని అటవీ భూముల్లో రైతులకు పట్టాలు ఇవ్వాలని గ్రామస్తులు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కోరారు. సాగు చేసుకుంటున్న భూముల్లో అటవీశాఖ అధికారులు దౌర్జన్యంగా ట్రెంచ్‌లు కొడుతున్నారని తెలిపారు. కేసులు బనాయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చాలా ఏళ్ల నుంచి పోరాటం చేస్తున్నామని తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. మంత్రిని కలిసిన వారిలో వైఎస్సార్‌సీపీ నేత బందిల డేవిడ్, రమేష్, అరుల్ ఉన్నారు.

ఆర్‌బీకేల్లో 21 రకాల సేవలు



రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి ప్రసాద్‌రావు

బుచ్చినాయుడుకండ్రిగ: రైతు భరోసా కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాద్‌రావు అన్నారు. శుక్రవారం బుచ్చినాయుడు కండ్రిగ, పల్లమాల గ్రామాల్లోని ఆర్‌బీకేలను తనిఖీ చేశారు. పీఎం కిసాన్, ఈకేవైసీ, ఈ–పంట నమోదు, వ్యవసాయ యంత్రీకరణ, ఎరువులు తదితర వాటిపై సిబ్బంది, రైతులతో చర్చించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అనే పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. వీటిపై రైతులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఆర్బీకే సిబ్బందిపై ఉందన్నారు. భరోసా కేంద్రాల్లో 21 రకాల సేవలు అందుతున్నాయని, రైతులు సద్వినియోగం చేసుకుని వ్యవసాయంలో లాభాలను సాధించాలని తెలిపారు. ఈ రబీ సీజన్‌లో పంటలకు కావాల్సిన యూరియా, డీఏపీ, ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆయన వెంట సహాయ వ్యవసాయ సంచాలకులు ధనంజయరెడ్డి, మండల వ్యవసాయాధికారిణి భారతి ఉన్నారు.

నిరుపేదల జీవితాల్లో వెలుగులు



పెన్షన్లు అందజేస్తున్న శివయ్య



పింఛన్ అందజేస్తున్న నేతలు

ఏర్పేడు: వైఎస్సార్ పెన్షన్ కానుకతో పేదల జీవితాల్లో వెలుగులు నిండుతున్నట్లు సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు నల్లపాలెం శివయ్య అన్నారు. శుక్రవారం ఏర్పేడు సచివాలయ పరిధిలో లబ్ధిదారులకు నూతన పెన్షన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుల, మత రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నట్లు వివరించారు. ప్రతి కుటుంబం లబ్ధి పొందుతున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి చొరవతో సచివాలయ పరిధిలో సెప్టెంబర్ నెలకు 15 నూతన పెన్షన్లు మంజూరైనట్లు వెల్లడించారు.

నూతన పింఛన్ల పంపిణీ

కేవీబీపురం: మండలంలో నూతనంగా మంజూరైన 276 పింఛన్లను వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గవర్ల కృష్ణయ్య చేతుల మీదుగా శుక్రవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. తిమ్మసముద్రం, పవనివారికండ్రిగ, రాయపేడు, వగత్తూరు తదితర గ్రామాల్లో వీటిని అందజేశారు.

కుక్కలగుంటలో ఫ్యామిలీ డాక్టర్ సేవలు



పరీక్షలు చేస్తున్న డాక్టర్ శిల్ప

ఏర్పేడు: గుడిమల్లం సచివాలయ పరిధిలోని కుక్కలగుంటలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పాపానాయుడుపేట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు గ్రామానికి చెందిన 80 మందికి బీపీ, షుగర్, రక్త పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మధ్యాహ్నంపైన దీర్ఘకాలిక రోగులను పరీక్షించి మందులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ శిల్ప, సీహెచ్‌ఓ లలిత, పీహెచ్ఎన్ అన్నపూర్ణ పాల్గొన్నారు.

అమర ఆస్పత్రిలో అరుదైన ఆపరేషన్



మహిళ కడుపు నుంచి తొలగించిన కణితి

రేణిగుంట: రేణిగుంట కరకంబాడిలోని అమర ఆస్పత్రిలో ఓ మహిళకు అరుదైన ఆపరేషన్ చేసి 3.5కిలోల బరువున్న కణితిని తొలగించినట్లు ఆస్పత్రి సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ మునిక్రిష్ణ తెలిపారు. హయత్‌బీ(56) అనే మహిళ కడుపు ఉబ్బరంతో ఆస్పత్రికి వచ్చిందన్నారు. ఆమెకు వైద్య పరీక్షలు చేసి కడుపులో 3.5కిలోల కణితి ఉన్నట్లు గుర్తించామన్నారు. ఎలాంటి సమస్య తలెత్తకుండా తొలగించినట్లు తెలిపారు. అమర ఆస్పత్రిలో అధునాతన వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని, గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగంలో జీర్ణకోశ వ్యవస్థలో ఎలాంటి సమస్యకైనా, క్యాన్సర్ సంబంధిత సమస్యలకైనా ల్యాప్రో స్కోపీ ద్వారా అత్యుత్తమ చికిత్స చేస్తున్నట్లు వివరించారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత ఆపరేషన్లు చేస్తామన్నారు.

రైల్వే పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశంలో పాల్గొన్న రైల్వే పెన్షనర్లు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి రైల్వేస్టేషన్ ఆవరణలో ఆల్ ఇండియా రైల్వే పెన్షనర్ అసోసియేషన్ (ఏఐఆర్ఆర్ ఎఫ్) సమావేశం శుక్రవారం జరిగింది. గుంతకల్లు డివిజనల్ ప్రెసిడెంట్ జయంత్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ కళాచంద్ర హాజరయ్యారు. పెన్షనర్ల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో డివిజనల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ భూషణమణి, కార్యవర్గ సభ్యులు ముని బాబు, ధనంజయ రెడ్డి, గోపాలకృష్ణ, మునిరత్నం, ముద్దు కృష్ణ, జ్ఞానశేఖర్, లోకనాథం పాల్గొన్నారు.

సిద్ధార్థలో ఘనంగా ఇంజినీర్స్ డే



విశ్వేశ్వరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

నారాయణవనం: ఇంజనీర్స్ డేను పురస్కరించుకుని సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. ప్రిన్సిపల్ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. విశ్వేశ్వరయ్య తిరుమల ఘాట్ రోడ్ నిర్మాణంలో ప్రధాన భూమిక పోషించారన్నారు. కొండలపై రోడ్ల నిర్మాణానికి నూతన ఒరవడులను సృష్టించి ఇంజినీరింగ్ విద్యకే వన్నె తెచ్చారని తెలిపారు. అనంతరం సివిల్ విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, పెయింటింగ్, ప్రోమో పోటీలు నిర్వహించి విజేతలకు సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేశారు. సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపల్ జనార్ధనరాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పెట్టుబడులపై అవగాహన అవసరం

ఆర్థికంగా ఎదగడానికి పెట్టుబడుల నిర్వహణపై ఎంబీఏ విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని పలువురు పేర్కొన్నారు. సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో డిపార్టమెంట్ ఆఫ్ ఎంబీఏ నైపుణ్య శిక్షణా తరగతులను నిర్వహించారు. ఆర్థికపరమైన పొదుపు, పెట్టుబడుల గురించి నిర్వహించారు. సెబీ రిజిస్టర్డ్ మెంబర్ మూర్తి ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, మ్యూచివల్ ఫండింగ్‌లో పెట్టుబడుల మెలకువలను వివరించారు.

దాతల సేవలు ప్రశంసనీయం



ఫొటోలు అందిస్తున్న దాతలు

నాగలాపురం: ప్రభుత్వ పాఠశాలలకు దాతలు చేస్తున్న సేవలు అభినందనీయమని ఎంఈఓ బాబయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని రాజులకండ్రిగ ఎంపీపీ పాఠశాలకు అదే గ్రామానికి చెందిన చంద్ర స్వామీజీ, భార్గవి, ప్రసాద్ రాజు విద్యార్థులకు అవసరమైన నోటు పుస్తకాలు, కలర్ ప్రింటర్, జాతీయ నాయకుల ఫోటోలను అందజేశారు. కార్యక్రమంలో ప్రాధానోపాధ్యాయుడు తంగరాజ్, ఉపాధ్యాయులు సోమలత, తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ ప్రసాద్ పాల్గొన్నారు.

డీకేటీ భూములు స్థానికులకే ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

నాగలాపురం: డీకేటీ భూములను ఆయా పంచాయతీల్లోని స్థానికులకే ఇవ్వాలని తహసీల్దార్ ప్రసన్న కుమార్ వీఆర్వోలకు సూచించారు. శుక్రవారం రెవెన్యూ కార్యాలయంలో సచివాలయ సర్వేయర్లు, వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లోని డీకేటీ భూములను ఆయా పంచాయతీల్లోని పేదలకు మాత్రమే మంజూరు చేయాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ పీకేఎం బాబు, డిప్యూటీ తహసీల్దార్ ప్రసన్నకుమార్, ఎంపీపీ సింధు, వైస్ ఎంపీపీ కుమారి, సర్పంచ్ సుధా చిన్నదొరై, నాయకులు అపరంజిరాజు, మోహన్ మొదలియార్, కులశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

సీఎం జగనన్నతోనే పారదర్శక పాలన

- ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం



ఇరుగుళంలో సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

సత్యవేడు: రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూర్చాలన్న ధ్యేయంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పారదర్శక పాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇరుగుళం సచివాలయం పరిధిలో ఎమ్మెల్యే పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలకు సంక్షేమ పథకాలను వివరించి బుక్‌లెట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని చంద్రబాబు నాయుడు అవినీతికి పాల్పడ్డారని విమర్శించారు. ఆయన అరెస్టు వెనుక ప్రభుత్వ తొందరపాటు, ప్రతీకారం, కక్షసాధింపులు లేవన్నారు. ప్రజల పక్షాన ఉంటానన్న జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ప్రస్తుతం చంద్రబాబు పక్షాన నిలబడి ఆయన అరెస్టును ఖండించడం, పార్టీకి మద్దతు ఇస్తానని చెప్పడం సిగ్గుచేటన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన 98 శాతం హామీలను అమలు చేసినట్లు తెలిపారు. పంచాయతీ పరిధిలో 30 మంది కౌలు రైతులకు రూ. 4,99,500 చెక్కులను అందజేశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో ఏడుగురు గర్భిణులకు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, సీడీపీఓ దేవకుమారితో కలిసి సీమంతం చేశారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టకాహారం తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని సూచించారు.

ఇంటి పట్టాలు ఇవ్వాలని విజ్ఞప్తి

పంచాయతీ పరిధిలో 200 మందికి ఇంటి పట్టాలు ఇవ్వాలని స్థానికులు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంను కోరారు. స్పందించిన ఎమ్మెల్యే ప్రభుత్వ స్థలాలను గుర్తించి త్వరితగతిన అర్హులైన వారికి ఇంటి పట్టాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ షేక్ జరీనా బేగంను ఆదేశించారు. అలాగే ఎస్సీ మిట్ట కాలనీలో సీసీరోడ్డు, డ్రైన్లు, మురుగు కాలువలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరారు. స్థానికంగా ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు సుమన్ కుమార్, ఎంపీపీ వి.ప్రతిమ, జెడ్పీటీసీ సభ్యురాలు పి. విజయలక్ష్మి, ఎంపీడీఓ చంద్రశేఖర్, తహసీల్దార్ షేక్‌జరీనా బేగం, వైస్ ఎంపీపీ వెంకటరత్నం, గురుప్రసాద్, సర్పంచ్ శేఖర్, పార్టీ మండల కన్వీనర్ సుశీల్‌కుమార్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, సురుటుపల్లి ఆలయ చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు శరవణన్, బాలయ్య, సురేంద్ర, శెల్వి, ఇంద్రాణి, షీలా, సుధాకర్, వైఎస్సార్‌సీపీ నాయకులు మస్తాని, సోమశేఖర్, సురేంద్రరెడ్డి, శ్యాంప్రసాద్ రెడ్డి, వంశీరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, గోవిందస్వామి, రవి, మాణిక్యం, రమణ, రూబెన్, అజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ జీవితం స్ఫూర్తిదాయకం



సత్యవేడులో అంబేడ్కర్ విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే

భారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేడ్కర్ జీవితాన్ని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. శుక్రవారం సత్యవేడులో అంబేడ్కర్ విగ్రహావిష్కరణలో ఆయన మాట్లాడారు. అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. సత్యవేడులో అంబేడ్కర్ భవనం, కమ్యూనిటీ హాలు ఏర్పాటు త్వరితగతిన చేపడుతున్నట్లు తెలిపారు. ఈ భవనం సమీపంలో టీటీడీ కల్యాణ మండపం, వ్యవసాయ గిడ్డంగిలు కూడా ఏర్పాటు చేస్తామన్నారు. అంబేడ్కర్ భవనం, కమ్యూనిటీ హాలు పూర్తయినే పేద దళిత కుటుంబాలకు వివాహ వేదికగా కూడా ఉపయోగపడుతుందన్నారు. 2019లో తెలుగుగంగ ప్రాంతంలో అంబేడ్కర్ విగ్రహావిష్కర చేపట్టేందుకు చర్యలు తీసుకుంటే స్థానిక టీడీపీ నాయకుడు కోర్టుకెక్కాడని.. ప్రస్తుతం కోర్టులో ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు రావడంతో సత్యవేడు–ఊత్తుకోట మార్గంలో విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే అంబేడ్కర్ భవన నిర్మాణానికి కలెక్టర్ 50 సెంట్ల స్థలం కేటాయించారని తెలిపారు. అంబేడ్కర్ ఆర్మీ అధ్యక్షుడు గోపి, అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు బాలయ్య, ఉపాధ్యక్షులు మానిక్యం, రవి, కార్యదర్శి రమణ, జోషఫ్, దళిత నాయకులు గోవిందస్వామి, రాజ, పూల పళని తదితరులు పాల్గొన్నారు.

లగడపాటి భాస్కర్‌కు అశ్రు నివాళి



నివాళులర్పిస్తున్న అంజూరు తారక శ్రీనివాసులు



లగడపాటి భాస్కర్ (ఫైల్)

శ్రీకాళహస్తి: పట్టణంలోని ముత్యాలమ్మ గుడివీధిలో నివాసం ఉంటున్న ప్రముఖ కవి, రచయిత లగడపాటి భాస్కర్‌రావు శుక్రవారం మృతి చెందారు. ఆయన మృతదేహానికి శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్, ఆర్డీఓ రామారావు పూలమాల వేసి నివాళులర్పించారు. వారి వెంట స్వర్ణమూర్తి, గణేష్, కొల్లూరు హరినాథ్ నాయుడు, కృష్ణ, రమేష్, నరసింహులు, బాలా గౌడ్ తదితరులు ఉన్నారు.

విద్యార్థినికి చేయూత



విద్యార్థినికి నగదు అందజేస్తున్న ప్రిన్సిపల్

నాగలాపురం: పిచ్చాటూరు మండలం గోవర్ధనగిరి ఎస్టీకాలనీలో వారం క్రితం జరిగిన అగ్నిప్రమాదంలో పోలమ్మ అనే విద్యార్థి ఇల్లు కాలిపోయింది. ఆమె చదువుతున్న అక్షర జూనియర్ కళాశాల కరస్పాండెంట్ ముత్యాల హరిబాబు, ఉదయ్‌కుమార్, ప్రిన్సిపల్ ప్రేమ్‌కుమార్ విద్యార్థిని కాలేజీ, బస్సు ఫీజుల నుంచి మినహాయింపు ఇస్తున్నట్లు ప్రకటించారు. ఆమెకు కావాల్సిన పుస్తకాలు అందజేశారు. అలాగే తోటి విద్యార్థులు రూ. 5,116 నగదు, సరుకులు అందజేసి మానవత్వం చాటుకున్నారు.